క్లుప్తంగా

గో సంరక్షణ ట్రస్టుకు రూ.5 లక్షల విరాళం


విరాళం అందిస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి గో సంరక్షణ ట్రస్టుకు బెంగళూరుకు చెందిన దాతలు మురళీకృష్ణ, మహేశ్వరి రూ.5లక్షలు విరాళం అందించారు. ఉదయం దాతల కుటుంబ సభ్యులు స్వామివారి దర్శనార్థం విచ్చేసి ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డికి స్వామివారి గో సంరక్షణ ట్రస్టుకు రూ.5లక్షలు విరాళంగా అందించారు. వారికి ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల మెదడుకు పదును


విద్యార్థులు తయారుచేసిన నమూనాలు

యాదమరి: మండలంలోని పీఈఎస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో విద్యార్థులు నిర్వహించిన సైన్స్ మేళాలో వారి మెదడుకు మంచి పదును పెట్టారని డీవైఈఓ చంద్రశేఖర్ అన్నారు. స్కూల్లో గురువారం అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వారి సౌజన్యంతో నిర్వహించిన సైన్స్ మేళాలో విద్యార్థులు పలు సైన్స్ ప్రయోగాలు చేసి ప్రదర్శించారు. సైన్స్ ప్రయోగాలను చిత్తూరు డీవైఈఓ పరిశీలించి విద్యార్థులను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

గోరుముద్ద అమలుపై ప్రత్యేక శ్రద్ధ


వంట పాత్రలను అందజేస్తున్న ఎంఈఓలు

ఐరాల: ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద పథకం అమలుపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని ఎంఈఓలు రుషేంద్ర బాబు, దామోదర్‌నాయుడు పేర్కొన్నారు. జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా వంట ఏజెన్సీలకు ప్రభుత్వం వంట పాత్రలను సరఫరా చేసింది. ఈ పాత్రలను గురువారం స్థానిక ప్రాథమిక పాఠశాల వద్ద హెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి చేతుల మీదుగా వంట ఏజెన్సీ నిర్వాహకులకు ఎంఈఓలు అందజేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్యను బట్టి ప్రతి ప్రభుత్వ పాఠశాలకూ ప్రభుత్వం వంట పాత్రలను సరఫరా చేసిందన్నారు. మండలంలో 60 పాఠశాలలకు వంట పాత్రలను అందజేసినట్లు తెలిపారు. నాణ్యమైన వంటపాత్రలను ప్రభుత్వం సరఫరా చేసిందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

85 మందికి వైద్య పరీక్షలు


వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ పూర్ణలత

ఐరాల: గ్రామీణుల ఆరోగ్యం కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిరుపేదలకు వరమని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. మండలంలోని ఇరువారంపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 మొబైల్ క్లినిక్ ద్వారా డాక్టర్ 85 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ జీవకళ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు


గాయపడ్డ మహదేవన్

గుడిపాల: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలైనట్లు ఏఎస్‌ఐ చలపతి తెలిపారు. తమిళనాడులోని కోయంబత్తూరుకు చెందిన మహదేవన్(28) గురువారం బెంగళూరు నుంచి చెన్నైకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా నరహరిపేట చెక్‌పోస్ట్ ఆవరణలో భద్రకాళమ్మ గుడివద్ద గుర్తు తెలియని కారు ఢీకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో మహదేవన్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే 108 వాహనంలో రాణిపేట సీఎంసీ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

చిత్తూరు నగరంలో అశేష జనం మధ్య సాగుతున్న సామాజిక సాధికార బస్సు యాత్ర


బహిరంగ సభా వేదికపై ప్రసంగిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణ స్వామి


సాధికార యాత్రకు నీరాజనం


ప్రముఖుల చిత్రపటాలకు పుష్పాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు నగరంలో వైఎస్సార్‌సీపీ గురువారం నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్రకు జనం నీరాజనం పట్టారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు, సంక్షేమ పథకాల లబ్ధిదారులు, వైఎస్ కుటుంబ అభిమానులు భారీగా తరలివచ్చి జగనన్నకు జై కొట్టారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ప్రజా ప్రతినిధులు ఈ యాత్రకు హాజరయ్యారు. అంతకుముందు నిర్వహించిన మేధావుల ఫోరం సమావేశంలో సంక్షేమ పథకాలతోనే సామాజిక సాధికారత సాధ్యమవుతుందని వక్తలు స్పష్టం చేశారు.

– చిత్తూరు కార్పొరేషన్


యాత్రలో ర్యాలీగా సాగుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

ఖర్చు లేకుండా పేదలకు కార్పొరేట్ వైద్యం

బంగారుపాళెం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదలకు పైసా ఖర్చులేకుండా కార్పొరేట్ వైద్య సేవలు అందిస్తున్నట్లు రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా అన్నారు. స్థానిక గ్రామ సచివాలయం ఆవరణలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సర్పంచ్ ఉమాదేవి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లోని ప్రతికుటుంబాన్ని సర్వే చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందిస్తున్న ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్నారని తెలిపారు. మన రాష్ట్రంలో అమలు చేస్తున్న ఆరోగ్య పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తాయని చెప్పారు. వైద్య శిబిరంలో 375 మందికి వైద్యులు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ ఉపాధ్యక్షుడు సర్దార్, మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి, ఇన్‌చార్జి తహసీల్దార్ అనిల్‌కుమార్, మండల వైద్యాధికారి లోహిత్‌చెంగల్‌రాయన్, వైద్య, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో మహిళకు పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్, వైద్య పరీక్షల కోసం వేచి ఉన్న మహిళలు

మంత్రి పెద్దిరెడ్డికి పూతలపట్టులో ఘన స్వాగతం

పూతలపట్టు: రాష్ట్ర అటవీ, విద్యుత్‌శాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి పూతలపట్టులో ఘనస్వాగతం పలికారు. మంత్రి గురువారం చిత్తూరులో జరుగుతున్న సామాజిక సాధికారత బస్సుయాత్రకు వెళుతున్న మార్గంలో ఎమ్మెల్యే ఎంఎస్ బాబు మండల కేంద్రంలో ఘనస్వాగతం పలికారు. పూతలపట్టు వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం అందజేసి, దుశ్శాలువలతో సన్మానించారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ తరపున నాయకులు కలిసి మెలిసి కష్టపడి పనిచేయాలని మంత్రి నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.


మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

గ్రామీణులకు ఫ్యామిలీ డాక్టర్ సేవలు



నలిశెట్టిపల్లెలో పరీక్షిస్తున్న డాక్టర్ ధాత్రేయచౌదరి, జొన్నగురకలలో పరీక్షిస్తున్న డాక్టర్ మోహన్ వేలు

తవణంపల్లె: ఫ్యామిలీ డాక్టర్ ద్వారా గ్రామాల్లో పేదలందరికీ ఇంటింటికీ వైద్య సేవలందుతున్నాయని వైద్యాధికారులు ధాత్రేయచౌదరి, మోహన్‌వేలు అన్నారు. మండలంలో గురువారం నలిశెట్టిపల్లెలో డాక్టర్ ధాత్రేయచౌదరి, జొన్నగురకల గ్రామంలో వైద్యాధికారి మోహన్‌వేలు రోగులకు వైద్య పరీక్షలు చేసి సూచనలు, సలహాలు ఇచ్చారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు, గర్భిణులకు, బాలింతలకు పరీక్షలు చేయించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. పేదల ప్రజలు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కలెక్టర్‌తో డిప్యూటీ కలెక్టర్ రేణుక

చిత్తూరు కలెక్టరేట్ : సివిల్ సప్లయ్స్ విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రేణుక గురువారం కలెక్టర్ షణ్మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. చిత్తూరు ఆర్డీఓగా పనిచేసి ఆమె ఇటీవల సివిల్ సప్లయ్స్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమితులయ్యారు. అనంతరం పలు అంశాలపై కలెక్టర్‌తో చర్చించారు.



యాత్రకు తరలిన పార్టీ గణం

గుడిపాల: మండలం నుంచి సామాజిక సాధికార తబస్సు యాత్రకు భారీగా అభిమాన గణం తరలివెళ్లారు. ఈ కార్యక్రమాన్ని జెడ్పీవైస్ చైర్మన్ రమ్య, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు జనార్దన్ ఆధ్వర్యంలో పర్యవేక్షణ చేశారు.

ఈఈ కార్యాలయం ప్రారంభం

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో మీటర్స్ అండ్ ప్రొటెక్షన్(ఎంఅండ్‌పీ) ఈఈ కార్యాలయాన్ని గురువారం ఎస్‌ఈ కృష్ణారెడ్డి ప్రారంభించారు. ఇప్పటి వరకు తిరుపతిలో మాత్రమే ఉన్న ఈ కార్యాలయాన్ని పరిపాలన సౌలభ్యత కోసం చిత్తూరులో ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో ఎక్కడా మ్యానువల్‌గా రీడింగ్ తీయరాదన్నారు. విద్యుత్ సమస్యలుంటే 1912కు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఈలు రవికుమార్, హరి, పద్మనాభపిళ్లై, డీఈలు శేషాద్రి, జయప్రకాష్, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం

కార్వేటినగరం: పరిసరాలు శుభ్రంగా ఉంటే వ్యాధులు దూరమవుతాయని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు అన్నారు. మండల పరిధిలోని సురేంద్రనగరం దళితవాడ,, సురేంద్రనగరం గ్రామాల్లో గురువారం పరిసరాల శుభ్రతను పరిశీలించారు. జిల్లా ఇమ్యూనిజేషన్ అధికారి మాట్లాడుతూ గ్రామ వీధుల్లో వర్షపు నీరు నిల్వలు లేకుండా చూడాలన్నారు. వ్యర్థాలు ఇంటి ఆవరణలో లేకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వారంలో ఒక్కరోజు డ్రైడే పాటించి నీరు నిల్వ ఉన్న పాత్రలను కడిగి ఎండ బెట్టాలని తెలిపారు. కొబ్బరి చిప్పలు, ప్లాస్టిక్ బాటిళ్లు, టైర్లు వంటి వాటిలో వర్షపు నీరు నిల్వ చేరడం వల్ల లార్వాలు, దోమలకు నిలయంగా మారి డెంగ్యూ, మలేరియా, డయేరియా, చికెన్‌గున్యా వంటి ప్రాణాంతకమైన జ్వరాలు సోకే అవకాశం ఉంటుందన్నారు. ఆరోగ్య సిబ్బంది ప్రతి వారం శుభ్రత లేని ప్రాంతాలను గుర్తించి బ్లీచింగ్ చల్లి, పరిశుభ్రతను మెరుగు పరచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులపై దృష్టి పెట్టండి


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌వో రాజశేఖర్

చిత్తూరు కలెక్టరేట్ : వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ కేసులపై దృష్టి సారించాలని డీఆర్‌వో రాజశేఖర్ అన్నారు. కలెక్టరేట్‌లోని సూపరింటెండెంట్‌లతో, ప్రభుత్వ న్యాయవాదులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించేందుకు ప్రభుత్వ న్యాయవాదులు చర్యలు చేపట్టాలన్నారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న కేసుల పట్ల దృష్టి వహించాలని తెలిపారు. పెండింగ్ కేసుల వివరాలు ప్రతి నెలా కలెక్టరేట్‌కు పంపాలని సూచించారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ సీ సెక్షన్ సూపరింటెండెంట్ వాసుదేవన్, సీనియర్ అసిస్టెంట్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సమాధుల పండుగ


ప్రత్యేక అలంకరణలో సమాధులు


ప్రార్థనలు చేస్తున్న పాస్టర్ రెవరెండ్

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని కన్నన్ కళాశాల సమీపంలోని క్రైస్తవుల శ్మశానంలో గురువారం సమాధుల పండుగను ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులు తమ కుటుంబీకుల సమాధులను వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. కొవ్వొత్తులు వెలిగించి మృతిచెందిన వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్ రెవరెండ్ డాల్విన్ క్రిస్టియన్ దాస్ మత బోధనలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

ఓటుకోసం దరఖాస్తులు స్వీకరించండి

గుడిపాల: ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలని తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్ అన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరి నుంచి ఓటుకోసం దరఖాస్తు స్వీకరించాలని అధికారులకు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బీఎల్‌ఓలతో గురువారం సమావేశం నిర్వహించారు. గడిచిన నెలలో విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితాలో ఏమైనా అభ్యంతరాలుంటే డిసెంబర్ 9వ తేదీలోగా స్వీకరించాలని సూచించారు. నవంబర్ 4, 5, డిసెంబర్ 2, 3 తేదీల్లో ఓటర్ల జాబితాలో కొత్తగా ఓటర్లు చేర్పించేందుకు ప్రత్యేక శిబిరాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆ రోజుల్లో బీఎల్‌ఓలంతా వారి పరిధిలోని పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉండి అర్హులైన ఓటర్లు అందించే ఫారం-6 దరఖాస్తులను స్వీకరించాలన్నారు. మరణించిన ఓటర్లను, డబుల్ ఓట్లు ఉన్నవాటిని ఫారమ్–7 పెట్టి తొలగించాలన్నారు. ఒకే డోర్ నెంబర్‌లో 10 ఓట్లు ఉన్నట్లయితే వాటిని మరోసారి తనిఖీ చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కల్యాణి తదితరులు పాల్గొన్నారు.


బీఎల్‌ఓల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్

డెంగీ జ్వరాలపై నిర్లక్ష్యం వద్దు


డెంగీ జ్వరం సోకిన వ్యక్తి ఇంటి వద్ద వైద్యులు

యాదమరి: డెంగీ జ్వరాలపై నిర్లక్ష్యం వద్దు అని సంతగేటు ప్రభుత్వ వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్ సూచించారు. మండలంలోని యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చిన్నంపల్లె గ్రామంలో గురువారం ఒకరికి డెంగీ జ్వరం సోకినట్లు సమాచారం రావడంతో గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జ్వరం సోకిన వ్యక్తి ఇంటి పరిసరాలను శుభ్రం చేసి పెనాయిల్ చల్లారు. గ్రామస్తులకు సమావేశం ఏర్పాటు చేసి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జ్వరాలు సోకితే ఆస్పత్రిలో చికిత్స చేసుకోవాలని సూచించారు. చికిత్సలు చేసినా జ్వరం తగ్గకపోతే వెంటనే చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో రక్త పరీక్షలు చేసి వ్యాధి నిర్ధారణ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ, సబ్ యూనిట్ ఆఫీసర్ పీరు సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి కృషి

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తోందని కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. గిరింపేట లోని పాతకలెక్టరేట్‌లో గురువారం కలెక్టరేట్ యూనిట్ రెవెన్యూ భవనానికి భూమి పూజ నిర్వహించారు. ఆ సంఘ నాయకులు నిర్వహించిన పూజా కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని శిలాఫలకం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో రాజశేఖర్, కలెక్టరేట్ ఏవో కులశేఖర్, ఆర్డీవో చిన్నయ్య, జిల్లా రెవెన్యూ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అమర్‌నాథ్, హుస్సేన్, కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షులు పార్థసారథి, హేమాద్రిరాజు, తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వద్దు

విధి నిర్వహణలో అధికారులు అలసత్వం వహిస్తే కఠిన చర్యలుంటాయని కలెక్టర్ షణ్మోహన్ హెచ్చరించారు. పాతకలెక్టరేట్‌లోని పలు శాఖలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఆయా శాఖల్లోని పలు విభాగాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పురాతన రెవెన్యూ రికార్డుల రూంలోకి వెళ్లి రికార్డులను పరిశీలించారు. 1947 నుంచి రెవెన్యూ రికార్డులు ఉన్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఆ రికార్డుల భద్రతకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో రాజశేఖర్, ఏవో కులశేఖర్ పాల్గొన్నారు.

నేడు గంగవరంలో జగనన్నకు చెబుదాం

మండల స్థాయిలోనే ప్రజాసమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 3న పలమనేరు నియోజకవర్గం గంగవరం మండలం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో కార్యక్రమం ఉంటుందని చెప్పారు. అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని కలెక్టర్ ఆదేశించారు.


భవన నిర్మాణ పూజా కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ షణ్మోహన్

ఖోఖో పోటీలకు కొటాల విద్యార్థులు

యాదమరి: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఖోఖో పోటీలకు కొటాల ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం యూసఫ్ తెలిపారు. ఈ నెల 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు బంగారుపాళెం మండలంలో, ఈ నెల 14వ తేదీ నుంచి 16వ తేదీ వరకు తూర్పు గోదావరి జిల్లా కాకినాడలో జరిగే స్కూల్ గేమ్స్ ఖోఖో పోటీలకు అండర్ 14 విభాగంలో కొటాల పాఠశాల నుంచి యశ్వంత్, జశ్వంత్, ఢిల్లీప్రియ, మైథిలీ ఎంపికయ్యారు. అండర్ 17 విభాగంలో ఝాన్సీరాణి ఎంపికైనట్లు వివరించారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను, పీఈటీ సురేష్‌ను అభినందించారు.


కొటాల విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల హెచ్‌ఎం యూసఫ్

ఫార్మా జేఏసీ అధ్యక్షుడిగా జయచంద్ర

పూతలపట్టు: చిత్తూరు జిల్లా ఫార్మాజేఏసీ అధ్యక్షుడిగా కె.జయచంద్ర ఎన్నికైనట్లు ఏపీ ఫార్మా జేఏసీ కన్వీనర్ సురేష్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో గురువారం కె.జయచంద్రను ఎన్నుకున్నారు. కళాశాల ప్రిన్సిపల్ జ్యోతి, సురేష్ బాబు చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందజేశారు. జయచంద్ర మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థుల సమస్యలు, ఫార్మసిస్టుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ జేఏసీ చైర్మన్ సురేష్ బాబు, డాక్టర్ సిద్ధయ్య, జిల్లా జేఏసీ అధ్యక్షుడు జయచంద్ర, ట్రెజరర్ కోట సుబ్బారావు, రాధాకృష్ణ, సుబ్బారెడ్డి, స్టేట్ జాయింట్ సెక్రటరీ బాలకృష్ణ, కళాశాల హెచ్‌ఓడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.


నియామక పత్రాన్ని అందుకుంటున్న జయచంద్ర